## కోటగిరి హైస్కూల్‌కు రోడ్ సేఫ్టీ చాంపియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోటగిరి పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు

కోటగిరి, ఏప్రిల్ 20 : హైదరాబాద్‌లో సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ చాంపియన్–2025 అవార్డుకు కోటగిరి జడ్పీహెచ్ఎస్ ఎంపికైంది. ఇందుకు సంబంధించిన అవార్డును హైదరాబాద్‌లో ఆదివారం అందజేశారు. తెలంగాణ డీజీపీ జితేందర్, టీఎస్‌పీఎస్ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా పాఠశాల తరఫున సోషల్ ఉపాధ్యాయులు బర్ల సాయిలు, ఎండీ అతీఖ్ అందుకున్నారు. అవార్డు రావడంపై ఇన్‌చార్జి ఎంఈవో, కోటగిరి హైస్కూల్ హెచ్‌ఎం నాదెండ్ల శ్రీనివాసరావు హర్షంవ్యక్తం చేశారు.

## ఇందల్వాయిలో ఆరు ఇండ్లలో చోరీ

- 10 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ

ఇందల్వాయి, ఏప్రిల్ 20 : మండలకేంద్రంలోని ఆరు ఇండ్లలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవికాలం కావడంతో శనివారం రాత్రి పలువురు దాబా ఇండ్లపై నిద్రించారు. అందరూ నిద్రపోతున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు గ్రామంలోని ఆరు ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుట్టి మంజుల, కట్టెల బాలయ్య, ఫర్హానా బేగం, గోదావరి, బేతల భూమయ్య తదితరుల ఇండ్లలో చోరీ జరిగింది. ఆరు ఇండ్లలో కలిపి మొత్తం 10 తులాల బంగారం, వెండి ఆభరణాలు, రూ. 3 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ

కంఠేశ్వర్, ఏప్రిల్ 20 : వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో ఆదివారం ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌షబ్బీర్ అలీ పాల్గొని మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుని, ముస్లిం మైనార్టీ సమాజాన్ని బలహీనపర్చేలా కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో సొంత ఖర్చుతో పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు.

## 23న ఉచిత ఉపనయనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 : నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో 21 మంది వటువులకు ఉచిత ఉపనయనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జయంత్‌కుమార్, రొట్టె సురేశ్ శర్మ తెపారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

**పోలీస్ కమిషనర్ సాయిచైతన్య**



అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందితో సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రాణాలకు తెగించిన చేసే సేవలు వెలకట్టలేనివని సీపీ సాయిచైతన్య అన్నారు. అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, పెద్ద పెద్ద భవనాల్లో ఫైర్ స్టేఫీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జిల్లాకేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీపీ హాజరుకాగా.. ఆయనకు ఫైర్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఫైర్ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. వ్యాసరచనపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఫైర్ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి టి. పరమేశ్వర్, నిజామాబాద్, ఆర్మూర్, ఇందల్వాయి స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు నర్సింగ్‌రావు, మధుసూదన్, విక్రంతోపాటు లీడింగ్ ఫైర్‌మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



చందూర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ముప్కాల్ మండల కేంద్రంలో..

చందూర్/ ధర్పల్లి/ ముప్కాల్, ఏప్రిల్ 20 : ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. చందూర్ మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకుడు మాధవరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ముప్కాల్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు హాజరు కావాలని కోరారు. రజతోత్సవ సభకు ధర్పల్లి మండలంలోని ప్రతి గ్రామం నుంచి సబ్బండవర్ణాలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఇంటి నుంచి కనీసం ఒకరు చొప్పున తరలివెళ్లి, విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

## కూలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

**ఒకరు అక్కడికక్కడే మృతి, మరో ఇద్దరికి గాయాలు**

సిరికొండ, ఏప్రిల్ 20 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కూలీ పనిచేసేందుకు వచ్చిన బిహార్ కూలీలపైకి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని కొండాపూర్ గ్రామశివారులో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. బిహార్‌కు చెందిన హమాలీలు మర్రిచెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కొండాపూర్ గ్రామానికి చెందిన జబ్బర్ నడుపుతున్న ట్రాక్టర్ వారిపైకి వేగంగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భూమాశ్రీకి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చింటూ, గోవింద్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. భూమాశ్రీ కుమారుడు లాలన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు.

## రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

- కాపర్ వైర్ చోరీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : మండలంలోని సుద్దపల్లి చెరువు వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేసి, కాపర్ వైర్‌ను చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. గతంలో కూడా చాలాసార్లు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారని, నిందితులను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 20 : జాతీయస్థాయి అండర్–17 బేస్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన సంకెపల్లి శశికుమార్, గంగోత్రి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 26వ తేదీవరకు న్యూఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్‌అండర్–17 జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఎంఈవో, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 20 : జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్ష నిర్వహించగా.. టెన్త్ విద్యార్థులు 925 మందికి 834 మంది హాజరుకాగా.. 91 మంది హాజరైనట్లు డీఈవో అశోక్, కో–ఆర్డినేటర్ తుల రవీందర్ తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 1,782 మంది హాజరుకావాల్సి ఉండగా 1,612 మంది విద్యార్థులు హాజరుకాగా.. 170 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

## నేటి నుంచి రైతు మహోత్సవం

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఏప్రిల్ 20 : రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో రైతు మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి ఉత్తమ్ కుమార్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ఉదయం 11 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సుమారు 150 స్టాళ్లు ఏర్పాటు చేశామని, రైతులు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖల శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు నూతన వ్యవసాయ పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారని వివరించారు.

## నేటి 'ప్రజావాణి' వాయిదా

కంఠేశ్వర్, ఏప్రిల్ 20 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం రైతు మహోత్సవ కార్యక్రమం ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేశామని, ఈనెల 28 నుంచి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక



మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 20 : నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నూత్‌పల్లి మారుతి, ప్రధానకార్యదర్శిగా సంకెపల్లి గంగాధర్, కోశాధికారిగా ఇందూరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబా శ్రీనివాస్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా గద్దల రమేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలుమల సురేశ్, జాతీయ నాయకుడు తెడ్డు గంగారాం, రేణిగుంట నాంపల్లి వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనుక ప్రమోద్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నందిపేట్ మండల కన్వీనర్ ప్రశాంత్ సన్మానించారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి, బదిలీపై వెళ్తున్న సునీత కుంచాలకు నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది ఆదివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమెను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.
– వినాయక్‌నగర్, ఏప్రిల్ 20

## నేడు భూభారతి చట్టంపై అవగాహన

ధర్పల్లి, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని దుబ్బాక రోడ్డులో ఉన్న రైతువేదికలో భూభారతి చట్టంపై సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ మాలతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరై, చట్టంపై అవగాహన కల్పిస్తామని, అన్ని గ్రామాల రైతులు తరలిరావాలని కోరారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సారంగాపూర్, ఏప్రిల్ 20 : రూరల్ మండలంలోని రాంనగర్, శాస్త్రీనగర్, శ్రీనగర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మహిళ అంత్యక్రియలను అడ్డుకున్న పోలీసులు



అంత్యక్రియలను అడ్డుకుంటున్న పోలీసులు

రుద్రూర్, ఏప్రిల్ 20 : మండలంలోని బొప్పాపూర్‌లో నందిగామ గంగవ్వ (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామస్తులు గంగమ్మ అంత్యక్రియలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తుండగా.. మృతదేహాన్ని వైకుంఠధామానికి తరలించే సమయంలో ఎస్సై సాయన్న సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. గంగవ్వ అనారోగ్యం కారణంగా మృతిచెందిందని, ఎందుకు అంత్యక్రియలను అడ్డుకుంటున్నారని గ్రామస్తులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆమె మృతిపై ఎవరైనా ఫిర్యాదు చేశారా అని పోలీసులను గ్రామస్తులు ప్రశ్నించారు. అనుమానాస్పద మృతిగా తమకు సమాచారం వచ్చిందని ఎస్సై తెలిపారు. సాధారణ మరణం చెందిన గంగవ్వ అంత్యక్రియలను అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు వినకుండా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## గడ్డివాములకు నిప్పపెట్టిన వ్యక్తిపై కేసు

రుద్రూర్, ఏప్రిల్ 20 : గడ్డివాములకు నిప్పు పెట్టినందుకు మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన నందిగామ ప్రవీణ్‌పై మూడు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న ఆదివారం తెలిపారు. బొప్పాపూర్‌లో ఆదివారం తెల్లవారు జామున సంగనోళ్ల వినోద్, నారోజి లచ్చయ్య, మద్నూర్ సాయిలుకు చెందిన గడ్డివాములకు నందిగామ ప్రవీణ్ నిప్పుపెట్టి పారిపోతుండగా గ్రామస్తులు చూశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సమావేశంలో వేల్పూర్‌లో 2004–2005 బ్యాచ్ విద్యార్థులు



బాల్కొండలో 2003–04 బ్యాచ్ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేల్పూర్/బాల్కొండ, ఏప్రిల్ 20: వేల్పూర్ జడ్పీహెచ్ఎస్ 2004–05 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో నిర్వహించారు. 20 ఏండ్ల తర్వాత వారంతా ఒకే వేదికపై కలువడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఎంకే గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు పండిత్ శ్రీనివాస్, శ్యామ్, మనోహర్, నర్సయ్య, శంకర్, ఉపాధ్యాయులు హాజరయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు.

## మంటలు పూర్తిగా ఆర్పివేయాలి

శక్కర్‌నగర్, ఏప్రిల్ 20: బోధన్ పట్టణ శివారులోని పాండుఫారం వద్ద మున్సిపల్ డంపింగ్ యార్డును ఆదివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈనెల 19న అగ్నిప్రమాదం కారణంగా డంపింగ్ యార్డులోని చెత్తాచెదారానికి మంటలు అంటుకోగా, వాటిని ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ వారు చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు కూడా జేసీబీ, ట్రాక్టర్లతో చెత్తను వేరు చేయిస్తున్నారు. పూర్తిగా మంటలను ఆర్పేందుకు సమయం పడుతుందని ఫైర్ అధికారులు తెలిపారు. బోధన్ అగ్నిమాపక కేంద్రంలో ఒకే శకటం ఉండగా, రెండు రోజులుగా డంపింగ్ యార్డులోనే మంటలు ఆర్పే పనిలో ఉంది. దీనికి తోడు అగ్నిమాపకశాఖ కార్యాలయంలో బోరు నీరు సరిపోవడం లేదు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారు. మంటలు పూర్తిగా ఆర్పివేయాలని అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు సబ్ కలెక్టర్ సూచించారు.

## ఘనంగా ఈస్టర్ సండే



మోతెలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

వేల్పూర్/డిచ్‌పల్లి, ఏప్రిల్ 20: మండలంలోని మోతె గ్రామంలో జీసస్ బ్లెస్సింగ్ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జి.ప్రేమ్‌కుమార్ క్రీస్తు పునరుత్థాన శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చిలో పునరుత్థాన పండుగ (ఈస్టర్ సండే)ను నిర్వహించారు. ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, జడ్‌డీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవ దినాకర్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## చౌట్‌పల్లిలో చెరువుకట్ట సుందరీకరణ

మోర్తాడ్, ఏప్రిల్ 20: చెరువు కట్ట అనగానే వివిధ రకాల పిచ్చిమొక్కలు, చెట్లు కనిపిస్తుంటాయి. అదే చెరువు కట్టను సుందరీకరించాలన్న తలంపుతో చౌట్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. చెరువుకట్టను శుభ్రం చేయించి కట్టపై గార్డెన్‌తోపాటు గడ్డి పరదాలు వేయించారు. కట్టపైన వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.3.80లక్షలతో ఈ మినీట్యాంక్ బండ్ పనులు చేస్తున్నారు. గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి మినీట్యాంక్ బండ్‌కు అయ్యే ఖర్చు మొత్తాన్ని గ్రామ కమిటీకి ఇవ్వడంతో పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. గ్రామానికి ఏదైనా చేయాలన్న తలంపుతో చెరువుకట్ట సుందరీకరణ పనులు చేపట్టామని వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రాజేందర్ అన్నారు. తన మిత్రుడు మధుకు విషయం తెలపగా ఆయన ముందుకు వచ్చి ఖర్చు మొత్తాన్ని భరించాడని తెలిపారు.





సుందరీకరించిన చౌట్‌పల్లి సమీపంలోని చెరువుకట్ట

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, **ACHANNAGARI SAMATHA** (Old Name) H.No. 1-23, Vill.Pothangal, Mdl:Navipet, Dist. Nizamabad. T.S., Changed my surname as **VUDEM SAMATHA** (New name) **W/o. VUDEM SHIVA REDDY**

**NTZ - 338594**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు మృతి

- ఒకరికి తీవ్రగాయాలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్20: పట్టణంలోని పెర్కిట్ 44వ జాతీయ రహదారి బైపాస్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓంకార్(14), భాను ప్రసాద్(11) బాలురు మృతి చెందగా విశ్వనాథ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన బంజ విశ్వనాథ్ పెర్కిట్‌లో జరుగుతున్న ఓ వివాహానికి తన కుమారుడు ఓంకార్, అతని స్నేహితుడు భాను ప్రసాద్‌ను తీసుకొని బైక్‌పై బయల్దేరాడు. పెర్కిట్ జాతీయ రహదారి బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ వైపు నుంచి వస్తున్న లారీ వీరి బైకును ఢీ కొట్టింది. ఈ ఘటనలో భాను ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన తండ్రీ కొడుకులు విశ్వనాథ్, ఓంకార్‌ను పోలీసులు పట్టణంలోని ప్రభుత్వ దవాఖాకు తరలించారు. ఓంకార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన విశ్వనాథ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విశ్వనాథ్ పరిస్థితి సైతం విషమంగా ఉందని తెలిసింది. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపుతోకి తీసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## అడవి మామిడిపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి..

మాక్లూర్, ఏప్రిల్20: మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో భిక్షాటన సాగించే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మూడు రోజులుగా గ్రామ శివారులోని గుడిలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు మాక్లూర్ పోలీసులను సంప్రదించాలనిఎస్సై కోరారు.

## గోదావరిలో అడుగంటిన జలాలు

రెంజల్, ఏప్రిల్ 20: మండలంలోని కందకుర్తి వద్ద గోదావరినది లో నీరు అడుగంటింది. పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందిగా ఉందని భక్తులు అంటున్నారు. ఈ ప్రాంతంలో చెక్ డ్యామ్ నిర్మిస్తే భక్తులు, మూగజీవాలకు నీరు లభిస్తుందని స్థానికులు అంటున్నారు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు?



నదిలో అడుగంటిన గోదావరినీరు

# ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ మీడియేటర్ అరెస్టు

- పరారీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు ఇమ్రాన్

నవీపేట,ఏప్రిల్ 20: మండల కేంద్రంలో కొంత కాలంగా మొబైల్ ఆన్‌లైన్ బెట్టింగ్ గుట్టును స్థానిక పోలీసులు రట్టు చేశారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ మీడియేటర్‌ను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్‌కు చెందిన ఇమ్రాన్ అనే క్రికెట్ బెట్టింగ్ ముఠా నాయకుడు పరారీలో ఉన్నాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన ఇమ్రాన్ నవీపేటకు చెందిన సాయితేజను మీడియేటర్‌గా నియమించుకున్నాడు. నవీపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులను నెల రోజుల నుంచి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. నుంచి మొబైల్ ఫోన్లలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మ బలికి వారితో డబ్బులు పెట్టించి మోసాలకు పాల్పడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు ఇమ్రాన్ సలహా మేరకు నవీపేటకు చెందిన సాయితేజ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులను కలుస్తూ వారితో బెట్టింగ్‌లో డబ్బులు పెట్టించి ఇమ్రాన్‌కు పంపించేవాడు. చాలా మంది యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టి డబ్బులు నష్ట పోతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మీడియేటర్ సాయితేజను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి బెట్టింగ్ నిర్వాహకుడు ఇమ్రాన్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. యువత బెట్టింగుల జోలికి వెల్లవద్దని ఎస్సై సూచించారు.

## అగ్నిమాపక శాఖ విధులు అభినందనీయం

శక్కర్‌నగర్, ఏప్రిల్ 20: అగ్ని ప్రమాదాల్లో అగ్నిమాపకశాఖ వారు అందించే సేవలు, విధులు అభినందనీయమని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా శక్కర్‌నగర్ చౌరస్తాలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో పలు ప్రమాదాల్లో విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. గత రెండు రోజులుగా డంపింగ్ యార్డులో మంటలు ఆర్పేందుకు నిరంతరంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది నజీమ్, ఆనంద్, రాహుల్, మాసిన్ ఖాన్, నర్సయ్య, వారిస్ అహ్మద్, వంశీకృష్ణారెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

## 30న మహనీయుల జయంతి

బోధన్, ఏప్రిల్ 20: పట్టణంలో ఈనెల 30న మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమం కరపత్రాలను ఆదివారం పట్టణంలోని తెలంగాణ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వారు ఆవిష్కరిచారు. కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్ మాట్లాడుతూ ఈనెల 30 పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్, జ్యోతిబాపూలే, బాబూ జగ్జీవన్‌రాం తదితర మహనీయుల జయంతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం బోధన్ డివిజన్ కో–కన్వీనర్లు నీరడి రవికుమార్, సింగాడే పాండు, దేవేందర్, సలహాదారులు కొండ్ర వెంకటి, వాగ్మారే సూర్యకాంత్ కోశాధికారి మాదస్తు శ్రావణ్ కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు దాసరి శ్యాం, రాహుల్, భీంరావు, కారం స్వామి, ఇందూర్ సాయిలు, గౌతం కుమార్, చరణ్, సాగర్, సురేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

## 'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నందిపేట్/ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్20: భూ సమ్యల పరిష్కారానికి భూభారతి, ఆర్‌వోఆర్ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి, ఆర్‌వోఆర్ చట్టంపై అధికారులు ఆదివారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. రైతుల భూ హక్కులు, రికార్డులు, తప్పుల సవరణ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సర్వే మ్యాప్ తయారీ తదితర మార్పులు చేసుకునేందుకు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, రెవెన్యూ అధికారులు రైతులు పాల్గొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాల నిరోధానికి చట్టం ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు అవుతున్న ఈ చట్టం మే మొదటి వారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతుందని వెల్లడించారు.

### సంక్షిప్తంగా..

- **నేటి నుంచి రైతు మహోత్సవాలు**- ఎడపల్లి, ఏప్రిల్20: ఈ నెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్‌లోని గిరిరాజ్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రైతు మహోత్సవ కార్యక్రమానికి మండలం రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయాధికారి సిద్దిరామేశ్వర్ ఆదివారం ఒక ప్రకటలో కోరారు. వ్యవసాయానికి సంబంధించి వివిధ శాఖలకు చెందిన ప్రైవేట్ కంపెనీల వారు 100 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని, దీనికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ హాజరుకానున్నట్లు తెలిపారు.
- **యువకుల రక్తదానం** - నందిపేట్, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సిలిండర్ లింగం, ఆయా పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.
- **కందకుర్తి ఎత్తిపోతల పాలకవర్గం ఏర్పాటు**- రెంజల్, ఏప్రిల్ 20: మండలంలోని కందకుర్తి ఎత్తిపోతల పథకం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇరిగేషన్ డీఈ బలరాం ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా గయాసొద్దీన్ (కందకుర్తి), ఉపాధ్యక్షుడిగా షేక్ షాకీర్‌హైమద్(నీలా), కోశాధికారిగా గైని భూపతి (నీలా), సభ్యులుగా అజంబేగ్, గాండ్ల సాయిలు, అలీంబేగ్, అన్సర్‌బేగ్, సంతోష్, గోసుల గంగాకృష్ణ, నిరడి అజయ్‌కుమార్, గైని భూమన్న, మార జనార్దన్, ఎండీ రఫిక్ ఎన్నికైనట్లు వెల్లడించారు.
- **సన్మానం**- ముప్కాల్, ఏప్రిల్ 20: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, గెజిటెట్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ నిజామాబాద్ జిల్లా కో చైర్మన్‌గా నియమితులైన ఓ.రమేశ్‌ను ఆదివారం ముప్కాల్ గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ థామస్, కట్ట మహేశ్, టి.సాయన్న, గద్దల రమేశ్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.
- **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**- మాక్లూర్, ఏప్రిల్20: మండలంలోని దుర్గానగర్, కృష్ణానగర్, గ్రామాల్లో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అలీం, జైల్‌సింగ్, జాఫర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **కార్యవర్గం ఎన్నిక** -బాల్కొండ, ఏప్రిల్ 20: మండలంలోని కిసాన్‌నగర్ అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కొండ అశోక్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అయిలాపూర్ శ్రీనివాస్, కోశాధికారిగా ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శివ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు హన్మంతు, నాగభూషణం, అమరనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.